మహిళలకు బాబు మార్క్ దగా

- ఆడబిడ్డ నిధిపై నోరెత్తని కూటమి ప్రభుత్వం
- పీ–4తో అనుసంధానం అంటూ కొత్త మెలిక


డ్వాక్రా మహిళలు (ఫైల్)

యలమంచిలి: ఎన్నికల సమయంలో కూటమి నేతలు సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తామని ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. ఇందులో ఒకటైన ఆడబిడ్డ నిధి పథకం అమలుపై ప్రస్తుతం అయోమయం నెలకొంది. తాము అధికారంలోనికి వస్తే 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మహిళలందరికీ నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు, ఇంట్లో ఎంతమంది ఉంటే అందరికీ వర్తింపజేస్తామని కూటమి నేతలు ఊరూవాడా ఊదరగొట్టారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఈ పథకం అమలుపై కూటమి నాయకులు నోరెత్తడం లేదు.

పీ–4 అంటున్న చంద్రబాబు

తల్లికి వందనం ప్రకటన సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ హామీలను అమలు చేసేశామంటూ చెప్పారు. ఆ సమయంలో ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి రెండింటినీ పీ–4కు అనుసంధానం చేశామంటూ మెలిక పెట్టారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ప్రభుత్వం ఆడబిడ్డ నిధి పథకం అమలు చేస్తుందా? లేదా? అనే అనుమానంలో మహిళలు ఉన్నారు.

ఆంధ్రాను అమ్మాలంటున్న వ్యవసాయ మంత్రి

ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే నిధులు లేవని, ఈ పథకం కోసం ఆంధ్రాను కూడా అమ్మాల్సి వస్తుందని చేసిన వ్యాఖ్యలు దుమారం లేపుతున్నాయి. దీనిపై కూటమి నేతలు ఊసెత్తడంలేదు. పాలకొల్లు నియోజకవర్గంలో సుమారు 93 వేల మంది ఈ పథకానికి అర్హులున్నారు. ప్రతి నెల రూ.1500 ప్రకారం రూ.13.95 కోట్లు ఇవ్వాలి. గడిచిన 13 నెలలుగా లెక్కిస్తే రూ.181.35 కోట్లు బకాయిలు చెల్లించాలి. నిబంధనలు లేకపోతే ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. బడ్జెట్ లోనూ రూ.3,341 కోట్లు కేటాయించామంటూ చెప్పుకుంటున్నా సరైన విధి విధానాలు ఖరారు చేయలేదు. ఈ పరిస్థితుల్లో ఆడబిడ్డ నిధి అమలుచేయాలంటే ఆంధ్రాను అమ్మాల్సిందేనంటూ మంత్రి అచ్చెన్న చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపుతున్నాయి. మహిళల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఏరుదాటక తెప్ప తగలేసే రకం అంటే ఇదేనని చర్చించుకుంటున్నారు. 2014 ఎన్నికల్లోనూ ఇలాగే అమలుకు సాధ్యం కాని 610 తప్పుడు హామీలిచ్చి మోసం చేశారని నిట్టూరుస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మహిళలను మోసం చేయకుండా ఇచ్చిన హామీను అమలు చేయాలని కోరుతున్నారు.

రాష్ట్రాన్ని అమ్మేయాలనడం సిగ్గుచేటు



ఆడబిడ్డ నిధిపై మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు సరైనవి కాదు. పథకం అమలుకు రాష్ట్రాన్ని అమ్మేయాలనడం సిగ్గుచేటు. ఆడబిడ్డ నిధి అమలు చేయలేమని చేతులెత్తేస్తే కూటమి దగాకోరు పాలనకు నిదర్శనం. పథకం ఇచ్చే వరకు ప్రజల తరపున పోరాటం సాగిస్తాం. – మద్దా చంద్రకళ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అంగన్‌వాడీ వింగ్ ఉపాధ్యక్షురాలు

ఆడబిడ్డ నిధి ఎగ్గొట్టే ప్రయత్నం



ఎన్నికల్లో చెప్పిన హామీ మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లోని 19 నుంచి 59 మధ్య ఉన్న వారందరికీ ప్రతి నెలా రూ.1500 ప్రకారం చెల్లించాలి. ఇప్పటికే పాలనా పగ్గాలు చేపట్టి 13 నెలలు కావస్తున్నా 13 పైసలు కూడా ఇవ్వలేదు. మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే ఆడబిడ్డ నిధి ఎగ్గొట్టేలా కనిపిస్తోంది. – షేక్ చాంద్ బీబీ, నూర్ భాషా జిల్లా గౌరవ అధ్యక్షురాలు

మహిళల ఎదురుచూపులు



రాష్ట్రంలో 18నుంచి 59ఏళ్ల మధ్య వయసున్న మహిళలందరూ ప్రతినెలా రూ.1,500 ఎప్పుడు అందుతుందోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. 13 నెలలు గడుస్తున్నా సీఎం చంద్రబాబు దాని ఊసే ఎత్తడంలేదు. ఈ పరిస్థితుల్లో మంత్రి అచ్చెన్న చేసిన వ్యాఖ్యలు మహిళల్లో మరింత కలవరపాటుకు గురి చేసింది. – ఇనుకొండ ధనలక్ష్మి, ఎంపీపీ, యలమంచిలి

ఆడబిడ్డ నిధి ఎప్పుడిస్తారో?



ఆడబిడ్డ నిధి కింద రూ.1,500 ఎప్పుడు జమ చేస్తారో ప్రకటించాలి.ఎన్నికల్లో ఆశచూపి ఇప్పుడు మాట మారుస్తున్నారు. మంత్రి అచ్చెన్న వ్యాఖ్యలు చూస్తే అలాగే అనిపిస్తోంది. ఇది సరైన విధానం కాదు. కచ్చితంగా ఆడబిడ్డ నిధి నగదు జమ చేయాలి. – శిరిగినీడి లక్ష్మి సునీత, ఎంపీటీసీ సభ్యురాలు, అబ్బిరాజుపాలెం

క్లుప్తంగా

శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు


శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలుపుతున్న నారాయణరెడ్డి

పెనుగొండ: వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన మండ విశ్వనాథనారాయణరెడ్డి ఆచంట నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం తాడేపల్లిగూడెంలోని శ్రీరంగనాథరాజు నివాసంలో కలసి పార్టీ అభివృద్ధికి, పటిష్టతకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రాష్ట్ర యోగా స్పోర్ట్స్ అసోషియేషన్ అధ్యక్షుడు నరేష్ రాజును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట మార్టేరు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొవ్వూరి బ్రహ్మేశ్వర రెడ్డి, సీనియర్ నాయకుడు చిర్ల సత్యనారాయణ రెడ్డి, గుడిమెట్ల సందీప్‌రెడ్డి ఉన్నారు.

అనారోగ్య బాధితులకు సాయం


బాధితురాలికి ఆర్థిక సహాయం అందిస్తున్న బుద్ధరాజు

పాలకొల్లు సెంట్రల్: గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురు అనారోగ్య బాధితులకు రూ. 30 వేలు ఆర్థిక సహాయం అందించినట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ బుద్ధరాజు తెలిపారు. శనివారం ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు అందించిన ఆర్థిక సహాయాన్ని బాధితులకు రూ. 10 వేలు చొప్పున అందజేశారు. కోమటితిప్ప, ధర్మరేవు, చింతపర్రు గ్రామాలకు చెందిన ముగ్గురు బాధితులకు ఆర్థిక సహాయం అందించినట్లు వివరించారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

పాలకొల్లు సెంట్రల్: యుక్త వయస్సులోనే స్వాతంత్రోద్యమంలో పాల్గొని ఎందరో మన్ననలు పొందిన దేశభక్తుడు పింగళి వెంకయ్య అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి అన్నారు. శనివారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ పరిశోధకునిగా, అధ్యాపకుడిగా, శ్రమజీవిగా, బహు భాషావేత్తగా ఆయన జీవితం ఎంతో ఆదర్శవంతమైనదన్నారు. ముందుగా వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, అధ్యాపకులు జాన్‌రాజ్, పాల్గొన్నారు.

ప్రజలకు రక్షిత మంచినీరు అందించాలి

నరసాపురం: పట్టణ వాసులకు శుభ్రమైన రక్షిత మంచినీరు అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ మున్సిపల్ అధికారులకు సూచించారు. శనివారం ఆమె పట్టణంలో మంచినీటి సరఫరాపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అధిక వర్షాలు పడే అవకాశం ఉన్నందున మంచినీరు కలుషితం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా కుళాయిల ద్వారా అందించే మంచినీటి సరఫరా విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆలం నిల్వలను సరిపడగా పెట్టుకుని క్లోరినేషన్ ప్రక్రియ సవ్యంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న దృశ్యం

యలమంచిలి: మండలంలోని కాజ తూర్పు గ్రామంలోని పింగళి వెంకయ్య జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, సాఫ్ట్ వేర్ ఉద్యోగి కడలి శేఖర్ రూ. 50 వేలతో పాఠశాలకు రంగులు వేయించడంతో పాటు 8వ తరగతి విద్యార్థులు 14 మందికి పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్‌ను శనివారం అందించారు. ప్రస్తుతం పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తమ పూర్వ ఉపాధ్యాయుడు పీర్ సాహెబ్ సూచనల మేరకు విద్యార్థులకు మెటీరియల్ అందిచానని శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా శేఖర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ లియాఖత్ ఆలీ అభినందించారు. గుంపుల నారాయణ ప్రసాద్, వినాయక్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా డ్రెయిన్

నరసాపురం: పట్టణంలో రాజరాజేశ్వరి థియేటర్‌కు వెళ్లే దారిలో మలుపులో ఉన్న డ్రెయిన్ ప్రమాదకరంగా ఉంది. డ్రెయిన్‌పై మూతలు సవ్యంగా లేవు. సరిగ్గా మలుపులో గొయ్యి పడడంతో అటుగా వెళ్లే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా పల్లపు ప్రాంతం కావడంతో వర్షం వస్తే రెండు, మూడు గంటలు వరకూ నీరు నిల్వ ఉండిపోతుంది. ఆ సమయంలో అక్కడ గొయ్యి ఉందనే సంగతి కూడా తెలియడం లేదు. మునిసిపాలిటీ మాత్రం ఈ డ్రెయిన్ అభివృద్ధి విషయంలో ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఈ అంశంపై దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ మండల కమిటీల నియామకం

పాలకొల్లు సెంట్రల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం ఇటీవల మండల కమిటీ అధ్యక్షులను నియమించారు. శనివారం మండల కమిటీల కార్యవర్గ సభ్యులను పార్టీ కేంద్ర కార్యాలయం నిర్ణయించింది. ఇటీవల పాలకొల్లు మండల అధ్యక్షుడిగా పెన్మెత్స ఏసురాజును నియమించగా మండల కమిటీ ఉపాధ్యక్షులుగా పానుకుమట్ల వీరాస్వామి, కవురు సత్యనారాయణ, గంటా నరేష్, జనరల్ సెక్రటరీలుగా ముదునూరి సూర్యనారాయణరాజు, దేవ జోసెఫ్ రాజు, వేంద్ర సత్యనారాయణ, శిద్దాని శివ కోటయ్య, సెక్రటరీలుగా కలిగితి కూమార రత్నం, మళ్ల వెంకట సత్యనారాయణ, కాగిత అశోక్, కడలి శ్రీనివాస్, నల్లి నాగరాజు, చేరుగొండి పద్మకిషోర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా రావూరి వెంకన్న, తమ్మా కోటయ్య, మేకా రాంబాబు, అడిదల కిషోర్ బాబు, ఉదితి శ్రీను, తెల్లా భసవ రాజు, కరీం దివానిమితరావు, పాలా శ్రీను, నరేంద్ర లోకేష్, కోటి తిరుమల రావు, గుత్తల కుమార్, కొయ్యే శ్యాం బాబు, కొల్లా సింహాద్రి, దాసరి మాలతి, గల్లి వెంకటరత్నం, కవురు శ్రీనివాస్, కవురు రాంపండు, ఊటాల చిట్టిబాబు, కప్పల వెంకటరావు, సోడదాశి కాసు, వాసా నాగేశ్వరరావులను నియమించారు.

పోడూరు మండలంలో..

పోడూరు మండల కమిటీ అధ్యక్షుడిగా కొత్రపాటి వీరాస్వామిని నియమించగా ఉపాధ్యక్షునిగా బళ్ల వెంకటాచలం, పెచ్చెట్టి ముత్యాలరావు, జనరల్ సెక్రటరీగా మీసాల ధన వెంకట నరసింహరావు, ఆకుమర్తి సుగుణరావు, నాగరాజు శివ రామచంద్రరాజు, బొంతు వెంకట నరసింహరాజు, సెక్రటరీగా ఉంద్రు మాణిక్యాలరావు, నరేంద్రవరపు వెంకటేష్, మామిడిశెట్టి వెంకటేశ్వరరావు (బద్రీ), కుసుమే రత్నరాజు, జుత్తిగ శ్రీను, అడబాల సత్తిబాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా వాసా జయచంద్రశేఖర్, నీలపాటి రత్నరాజు, గోగులమండ సునీల్ కుమార్, బొమ్మెటి రామారావు, కడలి దామోదరరావు, వర్ధనపు విజయకుమార్, గూడూరి రాము, బత్తుల సుధాకర్, కుంచర్లపాటి శ్రీనివాసరాజు, దిద్దే రాజశేఖర్, ఈదరపల్లి గణేష్ వర్మలను నియమించారు.

వేములదీవి వెంకన్నకు ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో వేములదీవి వెంకన్న

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి కాపులకొడప వేంకటేశ్వరస్వామిని శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి విశేష సేవలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు స్వామి వారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల ఆర్థిక సహకారంతో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

ప్రజలపై విద్యుత్ బాదుడు దారుణం


స్టాలిన్‌బాబు

యలమంచిలి: అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఒక పక్క ప్రజలపై ఎలాంటి విద్యుత్ భారాలు మోపమని చెబుతూ, మరొక పక్క సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15 వేల కోట్లు వసూలు చేసేందుకు సిద్ధమైందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ఇప్పటికే వినియోగదారుల నుంచి రూ.2750 కోట్లు వసూలు చేసిందని మండిపడ్డారు. అదానీ కంపెనీ స్మార్ట్ మీటర్లు బిగించడం అంటే పూర్తిగా విద్యుత్‌ను ప్రైవేటీకరించడమేనని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల ధనాన్ని ఏ స్థాయిలో కార్పొరేట్లకు కట్టబెట్టడానికి చూస్తుందో అర్థమవుతుందని వివరించారు. ప్రజలు పార్టీలకు అతీతంగా వ్యతిరేకించడం ద్వారానే ఈ స్మార్ట్ మీటర్ల బిగించడాన్ని ఆపగలమన్నారు. కాబట్టి విద్యుత్ వినియోగదారులంతా స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని స్టాలిన్ బాబు కోరారు.

తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా


పెనుగొండ: గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ


పాలకొల్లు సెంట్రల్: తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మాధురి

పెనుగొండ: బిడ్డకు తల్లి ముర్రిపాలు రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి మొదటి టీకాగా ఉపయోగపడుతుందని పెనుమంట్ర ప్రాజెక్టు సీడీపీఓ ఎ.కృష్ణకుమారి అన్నారు. శనివారం పెనుగొండలో గర్భిణులు, బాలింతల గృహ సందర్శన చేసి సూచనలు చేశారు. గర్భిణిగా ఉన్న సమయంలో పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు, వైద్యుల సూచనలు పాటించాలన్నారు. బిడ్డకు జన్మనివ్వగానే ముర్రిపాలు పట్టించాలన్నారు. దీని వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజరు జి.సుజాత, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: తల్లీబిడ్డల మధ్య అనుబంధాన్ని పెంచేది తల్లిపాలేనని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యర్రా మాధురి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధురి మాట్లాడుతూ శిశువులకు కావాల్సిన విటమిన్స్, ప్రోటీన్స్, ఫ్యాట్, సమతుల్య పోషకాలు తల్లిపాల వల్లే అందుతుందన్నారు. దీని వల్ల శిశువుల్లో పిల్లల్లో అధిక బరువు లేదా బరువు తగ్గడం వంటి సమస్యలు ఉండవన్నారు. తల్లిపాలు తాగుతూ పెరిగే పిల్లలకు భవిష్యత్‌లో డయాబెటిస్, ఒబెసిటి వంటి సమస్యలు రాకుండా ఉంటాయన్నారు. అందువల్ల ప్రతి తల్లీ బిడ్డ పుట్టిన ఏడాదిన్నరపాటు తల్లిపాలు పట్టించడం ఎంతో మేలు చేస్తుందన్నారు. తల్లి పాల వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డకు పాలిచ్చే తల్లి కూడా సరైన పోషకాహారం తీసుకోవడం వల్ల తల్లితోపాటు శిశువుకు మంచి పోషకాలు అందుతాయన్నారు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

పాలకొల్లు సెంట్రల్: ఆర్థిక సమస్యలతో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. శనివారం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బల్లిపాడు గ్రామానికి చెందిన బి.బంగారం (45) గత కొద్దిరోజులుగా ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. సమస్యలను తట్టుకోలేక శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని కుమారుడు చూసి కేకలు వేయగా స్థానికులు వచ్చి హుటాహుటిన భీమవరం ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షలు చేసిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మూర్తి తెలిపారు.

రైతులకు అండగా ప్రభుత్వం

పెనుగొండ: రైతులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ఆచంటలో శనివారం ఆయన అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ఆచంట నియోజకవర్గంలో రూ.13.48 కోట్లు రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఆచంట ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నాడీ సంబంధిత వ్యాధులపై అవగాహన


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆచార్య డాక్టర్ అనిల్

పెనుగొండ: ప్రస్తుత సమాజంలో చాలా మంది నాడీ సంబంధిత వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని తమిళనాడు సాయి యూనివర్సిటీ ఆచార్య డాక్టర్ అనిల్ అన్నమనీడి అన్నారు. పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో లైఫ్‌సైన్స్ విభాగం, బయోటెక్రాలజీ, బయో కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ విభాగాల్లో ఏర్పాటు చేసిన నాడీ సంబంధిత వ్యాధులపై సమాచార బదిలీ ప్రోటీన్ల పాత్రపై అవగాహన సదస్సు నిర్వహించారు. నాడీ సంబంధిత వ్యాధులు అల్జీమర్స్, పార్కికిన్, నస్స్ వ్యాధులతో మాత్రమే కాకుండా, నాడులను దెబ్బతీసే ప్రమాదకరమైన వ్యాధులు ఇంకా చాలా ఉన్నాయన్నారు. వాటిని సమాచార బదిలీ ప్రోటీన్ల ద్వారా కొంతవరకూ అదుపు చేయవచ్చునన్నారు. జర్మనీలో తాను చేసిన పరిశోధనలో భాగంగా బసూన్ ప్రోటీన్ పని చేసే విధానాన్ని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు మాట్లాడుతూ నేటి తరానికి నాడీ సంబంధిత వ్యాధులపై అవగాహన చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో బయోటెక్నాలజీ విభాగాధిపతి టి.రమేష్, బయో కెమిస్ట్రీ అధ్యాపకుడు టి.దివాకర్, జువాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.లక్ష్మీకాంతమ్మ, బోటనీ విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీలక్ష్మీ, పీజీ జువాలజీ అధ్యాపకులు రమణి, జెసిల్ల జాయ్, మిరియాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆడియో, వీడియో అసోసియేషన్ సమావేశం

పాలకొల్లు సెంట్రల్: రోజురోజుకూ పెరుగుతున్న టెక్నాలజీతో టెక్నీషియన్లు అందరూ అడ్వాన్స్ ట్రైనింగ్ తరగతులకు సమయం కేటాయించాలని ఆడియో, వీడియో అసోసియేషన్ అధ్యక్షుడు మానెం బసవరాజు అన్నారు. శనివారం స్థానిక వీవర్స్ కాలనీలో మహిళా మండలి విజ్ఞాన భవనంలో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టెక్నీషియన్ల పలు సమస్యలపై చర్చించారు. అనంతరం సభ్యులకు సభ్యత్వ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వట్టి శ్రీనివాస్, బత్తుల నాగేశ్వరరావు, నంబూరి పుల్లయ్య, యు.అప్పాజీ, బండి కృష్ణ,కేతా శంకర్ తదితరులు పాల్గొన్నారు